నిషేధమా.. అదెక్కడ?

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- అధికారుల చర్యలు శూన్యం
- కఠినంగా వ్యవహరించాలంటున్న ప్రజానీకం


మింది విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు


బీహెచ్‌పీవీ నుంచి వెళ్లే సర్వీసురోడ్డు పక్కన గెడ్డలో పేరుకుపోయిన పాలిథిన్ వ్యర్థాలు

అక్కిరెడ్డిపాలెం: ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నా ప్రజల్లో ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు. భావితరాలకు పెనుముప్పుగా పరిణమించే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడంలేదు. తెల్లవారితే చాలు ఇంట్లోకి అవసరమైన టిఫిన్లు, కూరగాయలు, పండ్లు, కిరాణా సామగ్రి వంటి ప్రతి వస్తువును ప్లాస్టిక్ కవర్లలోనే ఇళ్లకు తీసుకొస్తున్నారు. ఇంటికి టీ తీసుకు రావాల్సి వచ్చినా పాలిథిన్ కవర్లనే వినియోగిస్తున్నారు. ఇక మాంసం, చేపలు తేవాలన్నా ప్లాస్టిక్ సంచులనే వినియోగిస్తుండడంతో ఏ ఇల్లు చూసినా ప్లాస్టిక్ కవర్లతో నిండిపోతోంది. వాటిని బయట పారేయడంతో అవి మురుగు కాలువలు, రోడ్ల పక్క కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఫలితంగా వర్షాలు కురిసిన సమయంలో అవి మురుగు కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. మురుగునీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది.

ఈ ప్రాంతాల్లో అధికం

అక్కిరెడ్డిపాలెం, మింది, బీహెచ్‌పీతో పాటు నాతయ్యపాలెం ప్రాంతాల్లో వివిధ దుకాణాలు నడుస్తున్నాయి. వాటితో పాటు పండ్లు, కూరగాయల దుకాణదారులు, భోజన హోటళ్ల యజమానులు విచ్చలవిడిగా పాలిథిన్ సంచులు వాడుతున్నారు. వాటిని డంప్ చేయడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి కల్వర్టుల వద్ద నిలిచిపోతున్నాయి. అక్కడ మూగ జీవాలు చేరి వ్యర్థాలతో పాటు కవర్లు తినడంతో మృత్యువాత పడుతున్నాయి. పాలిథిన్ కవర్ల వాడకం వల్ల అనేక అనర్థాలు తలెత్తడమే కాకుండా నేల, నీరు, పర్యావరణం దెబ్బతింటాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ ప్రజలు వాటిని పెడచెవిన పెడుతున్నారు. ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, టీ గ్లాసులు, ప్లేట్లు, స్ట్రాలు, ప్యాకింగ్ కవర్లు లభ్యమవుతున్నాయి.

ప్రచారంలోనే నిషేధం

ఇప్పటికే పలు దఫాలు పాలిథిన్ వినియోగంపై జీవీఎంసీ యంత్రాంగం నిషేధం విధించి కొద్దిరోజుల్లోనే చేతులెత్తేసింది. ఈ ఏడాది ఆరంభం నుంచి పక్కాగా నిషేధం అమలు చేస్తామని ముందస్తుగా వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. కొద్దిరోజుల పాటు తనిఖీలు చేశారు. అది కూడా మూన్నాళ్ల ముచ్చటగా మారింది. మళ్లీ ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం ఫొటోలకే పరిమితమవుతోంది. ప్లాస్టిక్ సంచులు, వస్తువుల విక్రయాలు జరపకూడదని హెచ్చరికలు జారీ చేసినా ప్రయోజనం మాత్రం కనిపించలేదు. ప్లాస్టిక్ బదులు జనపనార, కాగితం కవర్లు వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు. అంతే కాకుండా ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా అవగాహన ర్యాలీలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగంపై సూచనలు చేస్తున్నప్పటికీ ప్రజల్లో మార్పు కనిపించడం లేదు. అధికారులు కూడా తూతూ మంత్రంగా కార్యక్రమం ముగించేస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ భూతం పర్యావరణానికి సవాల్ విసురుతోంది.

దువ్వాడ రైల్వేస్టేషన్ కిటకిట



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

- గణనీయంగా పెరిగిన ప్రయాణికులు, ఆదాయం
- ప్రయాణికులు 19 శాతం, ఆదాయం 34 శాతం వృద్ధి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు పోటెత్తుతున్నారు. పరిసర ప్రాంతాలు పారిశ్రామిక వృద్ధిలో దూసుకుపోవడం.. విద్యా సంస్థలు ఉండడంతో స్టేషన్ గుండా ప్రయాణించే వారి సంఖ్య పెరిగింది. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు, ఆర్జించిన ఆదాయం రెట్టింపు అయింది. 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరం గణాంకాల ప్రకారం దువ్వాడ రైల్వేస్టేషన్ ప్రయాణికులు, ఆదాయం పెరిగింది. అయితే అందుకు తగ్గట్టు వసతులు లేకపోవడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- 2023–24 సంవత్సరంలో 7లక్షల 94వేల మంది ప్రయాణం చేయగా, ఆదాయం రూ.8 కోట్ల 29 లక్షలు ఆర్జించింది. అదే గడిచిన సంవత్సరం (2024–25)లో 9 లక్షల 43వేల మంది ప్రయాణికులు స్టేషన్ నుంచి ప్రయాణం చేయగా, రూ.11కోట్ల 11 లక్షలు ఆర్జించింది.
- గత రెండేళ్ల వృద్ధి రేటును పరిశీలిస్తే దువ్వాడలో ప్రయాణికులు 18.77శాతం పెరగగా, ఆదాయం మాత్రం 34.06 శాతం పెరుగుదలతో వాల్తేరు డివిజన్‌లో దూసుకుపోతుంది. అదే విశాఖ స్టేషన్ రెండేళ్లలో ప్రయాణికులు, ఆదాయం విషయంలో 4.44 శాతం, 4.20 శాతం పెరుగుదలతో సరిపెట్టుకుంది.
- సింహాచలం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల 6.95 శాతం పెరగగా, ఆదాయం మాత్రం మైనస్ 6.34 శాతానికి పడిపోయింది.

వసతులు వస్తే మరింత తాకిడి

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల తాకిడి రెట్టింపు అవుతోంది. అందుకు తగ్గట్టుగా అమృత భారత్ కార్యక్రమంలో పునరాభివృద్ధి పేరుతో అధునాత భవనాలు, విలాసవంతమైన హోటళ్లు, రెస్టారెంట్లు హంగులు, ఆర్భాటాలు చేస్తున్నారు. అయితే ఈ లోగా లిఫ్టులు, ఎస్కలేటర్లు, మంచినీరు, సేదతీరడానికి రేకుల షెడ్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

‘తిప్పల’కు వైఎస్ జగన్ అభినందనలు


జగన్ మోహన్‌రెడ్డితో గురుమూర్తిరెడ్డి

గాజువాక: వైఎస్సార్‌సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డిని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభినందించారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకుల సమావేశంలో గురుమూర్తిరెడ్డిని అభినందించి జ్ఞాపిక అందజేశారు. పార్టీ పటిష్టానికి అనుభవాన్ని జోడించి పని చేయాలని జగన్ మోహన్‌రెడ్డి సూచించినట్లు ఈ సందర్భంగా గురుమూర్తిరెడ్డి తెలిపారు.

కేకే రాజుకు గాజువాక నాయకుల సత్కారం


కేకే రాజును అభినందిస్తున్న నాయకులు


గాజువాక: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కేకే రాజును ఆ పార్టీ గాజువాక ప్రాంత నాయకులు అభినందించారు. వార్డు కార్పొరేటర్లు ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో నాయకులు నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కేకే రాజును బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యక్రమాలకు తమ వంతు సహకారం పూర్తిస్థాయిలో అందజేస్తామని పేర్కొన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో నాయకులు పాలఘాట్ కృష్ణ, పెదిరెడ్ల ఈశ్వరరావు, కరణం వేణుగోపాలరావు, రోజారాణి, షఫీ, పేరం రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, సమీర్, సృజన్ తదితరులు ఉన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి


ఠాగూర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: నోబెల్ గ్రహీత, జాతీయ గీత రూపకర్త రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలను పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జీలకర్ర రమణ, జీలకర్ర భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై హర్షం


సదస్సులో మాట్లాడుతున్న కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి బదులుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. హిందూ ధర్మ పరివార్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్‌డ్రిల్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆకుల అప్పలసూరి, బొత్స దిలీప్, మారిశెట్టి వెంకటరమణ, సంతోష్, కృష్ణారెడ్డి, భాస్కర్‌భట్ల ప్రసాద్ శర్మ, నాగబాబు శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ రోడ్డు నెంబరు 4లో విద్యుత్ లైన్‌మన్ రెండు సర్వీసు పోల్సుపై రాంగ్ కనెక్షన్ ఇవ్వడంతో తన ఇంట్లో ఎంసీబీ బాక్సులు, పలు విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయని కాలనీ వాసి విశ్వేశ్వరరావు వడ్లపూడి విద్యుత్ అధికారులతో పాటు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు. లేని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని పేర్కొన్నాడు.

క్రీడాకారులకు సత్కారం


క్రీడాకారులను సత్కరిస్తున్న గాజువాక ఆర్టీవో జయప్రకాష్

అగనంపూడి: క్రీడల్లో రాణించే వారికి వచ్చే గుర్తింపు మరే ఇతర రంగాల్లో రాదని గాజువాక ఆర్టీవో వి.జయప్రకాష్ అన్నారు. జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన ఆరుగురు క్రీడాకారులను ఆయన అభినందించారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల వ్యక్తిగత ప్రతిష్ట పెరగడంతోపాటు ఆ కుటుంబం, గ్రామానికి, రాష్ట్రానికి మంచిపేరు వస్తుందన్నారు. అటువంటి క్రీడారంగంపై ఆసక్తి పెంచుకున్న వారు చెడు అలవాట్లకు దూరంగా ఉంటారన్నారు. అలాగే యువత డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మితిమీరిన వేగంతో, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల జరగరాని నష్టం జరిగితే కుటుంబం మొత్తం బాధపడుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఆనందబాబు మాట్లాడుతూ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలు రాయిపూర్‌లో జరుగనున్నాయని తెలిపారు. అక్కడ కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏ వన్ మాస్టర్ లార్డ్స్ అకాడమీ కోచ్ కొమ్మోజు అశోక్‌ను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, జి.భవాని నాయుడు, గోపిశెట్టి పద్మ, కె.సుజాత, కొమ్మోజు భీష్మాచారి, ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

కరుణించు.. కన్యకాపరమేశ్వరి


కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


ఆభరణాల అలంకరణలో ఉన్న వాసవీమాతకి పూజలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని వాసవీ జ్ఞాన మందిరంలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, అలంకరణ, అనంతరం మహిళలచే సామూహిక కుంకుమ పూజలు చేయించారు. అనంతరం ఇటీవల స్టీల్‌ప్లాంట్‌లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన బొడ్డు కృష్ణప్రసాద్, కేదారశెట్టి రాజేష్‌కుమార్ దంపతులను వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కులుకూరి మంగరాజు, బెల్లాల వెంకటరావు, బెల్లాల నాగేశ్వరరావు, పెంటబాబు, నర సింహమూర్తి, వాసవీ సేవకులు పాల్గొన్నారు.

- హౌసింగ్ బోర్డు సమీపంలోని కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయంలో కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాసవీ పంచాయతన దేవాలయం కమిటీ,వాసవీ క్లబ్ వైజాగ్ స్టీల్ పెదగంట్యాడ ఆధ్వర్యంలో అమ్మవారిని బంగారం, వెండి ఆభరణాలతో అలంకరించారు. అనంతరం పంచామృతాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముమ్మిడిశెట్టి ముత్యాల శెట్టి, కొల్లా అప్పలరాజు, మొగలపల్లి త్రిమూర్తులు, బొండాడ వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఉద్యమం


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింగరావు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలనే డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గాలి జనార్దనరెడ్డి అక్రమ ఎగుమతి చేశారని న్యాయస్థానం జైలు శిక్ష విధించిందన్నారు. ఇది ఆనాటి బీజేపీ ప్రభుత్వం అండతోనే జరిగిందని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 35 ఏళ్లుగా సొంత గనులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గాలితో పాటు పోస్కో కు సొంత గనులు కేటాయించడం దేశద్రోహమన్నారు. ఇప్పటికైనా సొంత గనులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాల్సి ఉందన్నారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాల్సి ఉందన్నారు. సమావేశంలో స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి యు.రామస్వామి పాల్గొన్నారు.

గాయాలతో యువకుడు ప్రత్యక్షం


చికిత్స పొందుతున్న శరణ్‌కుమార్

ఉక్కునగరం: వాకింగ్ కోసం రెండు రోజుల కిందట బయటకు వచ్చిన యువకుడు తీవ్ర గాయాలతో ప్రత్యక్షమయ్యాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. అగనంపూడి ప్రాంతానికి చెందిన సబ్బవరపు శరణ్‌కుమార్ (19) అనే యువకుడిని సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో స్నేహితులు ఉక్కునగరంలోని స్టేడియం సమీపంలోని వాకింగ్ ట్రాక్ వద్ద డ్రాప్ చేశారు . వాకింగ్ అనంతరం ఇంటికి వెళ్లాల్సిన ఆ యువకుడు కనిపించలేదు. శరణ్ కోసం వెతికిన తల్లిదండ్రులు కనిపించక పోవడంతో బుధవారం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాలింపు చేపట్టగా అగనంపూడి ఆస్పత్రి రహదారిలో గాయాలతో దొరికాడు. అతన్ని గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అతనికి స్పృహ వస్తే గాని ఏం జరిగింది చెప్పలేమని పోలీసులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


వీర బ్రహ్మేంద్రస్వామికి పూజలు చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు


భక్తులకు అన్నసమారాధన చేస్తున్న కోమటి శ్రీనివాసరావు


పూజలు చేస్తున్న నాయకులు, అసోసియేషన్ ప్రతినిధులు

కూర్మన్నపాలెం: పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని బుధవారం కణితి కాలనీలో ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వీర బ్రహ్మేంద్రస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి ఆశీస్సులు ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి శంకర్‌నారాయణ, బొడ్డగోవింద్, వెంకటరమణ, సన్యాసిరావు,ఆడారి శ్రీను పాల్గొన్నారు.

- 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి శ్రీనివాసరావు దంపతులు పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామికి పూజలు నిర్వహించి అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో వడ్లపూడి ఈశ్వరరావు, రమాదేవి, శేషు,నాగేశ్వరరావు,సత్తిబాబు,బ్రహ్మాజీ పాల్గొన్నారు.


ఆరాధనోత్సవాలను ప్రారంభిస్తున్న బీహెచ్‌ఈఎల్ ఈడీ సుబ్రహ్మణ్యం

ఉక్కునగరం: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. స్వామి 332వ ఆరాధనోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ విశ్వబ్రాహ్మణ సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో సెక్టార్–5 మరిడిమాంబ ఆలయం ఎదురుగా ఉన్న స్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. రుత్వికులు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి డి. ఆదినారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు ఎం. శ్రీనివాస్, మల్లేశ్వరరావు, ఉమా మహేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కులోని గోవిందమాంబ సమేత పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి సమాధి ఆరాధనోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి సత్యారావు, ముద్దుర్తి శ్రీరామ్మూర్తి, కణితి అప్పలరాజు, ద్వారపూడి గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

భెల్‌లో..

అక్కిరెడ్డిపాలెం: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలను బీహెచ్‌ఈఎల్‌లోని పాత కమ్యూనిటీ హాల్లో ఘనంగా నిర్వహించారు. బీహెచ్‌ఈఎల్ ఈడీ జి.సుబ్రహ్మణ్యం పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిచారు. జీఎం గౌరీ శంకర్, ఏజీఎం లీల, సీనియర్ మేనేజర్ చంద్రశేఖర్, అసోసియేషన్ కార్యదర్శి వివిఎస్‌మూర్తి, అధ్యక్షుడు కర్రి ప్రకాశరావు, కోశాధికారి ఎం.ప్రసాదరావు, వివిధ కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదరంగం పోటీలు


చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చదరంగం (చెస్) పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 13 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివించి నీతిని వివరించారు.

పోరాట యోధుడు అల్లూరి


అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహాత్మాగాంధీ సేవా సంఘం ప్రతినిధులు


సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్షత్రియ సంఘం నాయకులు

అగనంపూడి: తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని అల్లూరి సీతారామరాజు క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు దంతులూరి సుబ్బరాజు అన్నారు. మన్యం వీరుడి వర్ధంతిని పురస్కరించుకొని 79వ వార్డు పాత అగనంపూడి సత్రం కూడలిలో ఆయన చిత్రపటానికి మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావుతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారిని ఎదురించి నిల్చొని విప్లవ పోరాటం చేసి భారతదేశం ఉద్యమంలో ఊపుతీసుకువచ్చిన విప్లవకారుడు అల్లూరి సీతారామరాజును భారత జాతి ఉన్నంతవరకు స్మరించుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కరణం జగదీష్, ఎం.వెంకటరావు, లక్ష్మణరావు, ఎస్.అప్పారావు, సన్యాసిరావు, ముత్యాల అప్పారావు, నాగబాబు పాల్గొన్నారు.

ఘన నివాళి

గాజువాక: మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు గాజువాక క్షత్రియ సేవా సంఘం నాయకులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఎం.వి.సుబ్బరాజు ఆధ్వర్యంలో మన్యం వీరుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి దీనం కొండ కృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు జి.ఎస్.ఎన్.రాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలల వేసవి వికాస శిబిరం ప్రారంభం


మ్యాజిక్ షో చేస్తున్న ఇంద్రజాలికుడు విజయకుమార్

ఉక్కునగరం: గాయత్రి చేతన కేంద్రంలో బుధవారం గాయత్రి బాలల వేసవి వికాస శిబిరం ప్రారంభమైంది. విశాఖ గాయత్రి పరివార్ శాఖ ఆధ్వర్యంలో 6 నుంచి 15 ఏళ్ల లోపు బాలబాలికలకు ఈ శిబిరం ఏర్పాటు చేశారు. బాలలకు ధ్యాన శిక్షణ, యోగా అభ్యసనం, జ్ఞాపకశక్తి వృద్ధితో పాటు వివిధ వికాస కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రముఖ ఇంద్రజాలికుడు విజయకుమార్ మ్యాజిక్ షో నిర్వహించి పిల్లలను ఆహ్లాదపరిచారు. గాలిలో వివిధ వస్తువులు సృష్టించి అబ్బురపరిచాడు. పిల్లలకు మ్యాజిక్‌లో మెలుకవలు నేర్పించారు. అనంతరం దంత వైద్యురాలు డాక్టర్ మౌనిక దంతాల ఆరోగ్యం, నోటి పరిశుభ్రత గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గాయత్రి చేతన కేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.